వైభవంగా శ్రీవారి చక్రతీర్థం



హఫీజ్‌పేట్ : వేంకటేశ్వరస్వామి అష్టవింశ 28వ బ్రహ్మోత్సవాలలో భాగంగా బుధవారం కన్నుల పండుగగా శ్రీవారి చక్రతీర్థం నిర్వహించారు. ఉదయం 7.30 గంటల 9.30 గంటల వరకు నిత్యోపాసనం, పూర్ణాహుతి, ఉత్సవాన్త స్నపనం అనంతరం పుష్కరిణిలో స్వామి వారి చక్రతీర్థ స్నానం, ధ్వజావరోహణం నిర్వహించారు. అనంతరం స్వామివారి శేష వస్త్రాలను వేలం వేశారు. మధ్యాహ్నం 12.00 గంటలకు హారతి ,తీర్థ ప్రసాదాలు భక్తులకు అందించారు. 1 గంటకు అన్నప్రసాద వితరణ బుచ్చిరామకృష్ణ వర్మ, పద్మావతిలు జరిపించారు. రాత్రి 7.00 గంటల వరకు మేళతాళాల నడుమ రథోత్సవం నిర్వహించారు.

23 పుస్తకాల ఆవిష్కరణ

రాయదుర్గం: మనూలో పలువురు అధ్యాపకులు, పరిశోధకులు రచించిన 23 పుస్తకాలను బుధవారం ఆవిష్కరించారు. ఇంగ్లిష్, అరబిక్, ఉర్దూ భాషల్లో వివిధ విషయాలను పొందుపరుస్తూ ఈ పుస్తకాలను రూపొందించారు. కార్యక్రమంలో ఐక్యూసీ డైరెక్టర్ ప్రొఫెసర్ సయ్యద్ ఐనుల్ హసన్, ప్రొఫెసర్ రామ కొండపల్లి పాల్గొన్నారు.

పచ్చందాల పార్కు

- ఫొటోషూట్లకు కేరాఫ్ అడ్రస్
- ప్రత్యేక ఆకర్షణగా పుంగనూరు ఆవులు
- 'గుల్‌మొహర్ కాలనీ జీహెచ్‌ఎంసీ పార్కు' ప్రత్యేకత

శేరిలింగంపల్లి: పచ్చదనం.. ఆహ్లాదం.. గుల్‌మొహర్ పార్కు సొంతం అన్నట్లు ఉంది. ప్రశాంతమైన వాతావరణం... పక్షుల కిలకిల రావాలు... రాతి సంపద.. మహనీయుల శిల్పాలతో అలరారుతోంది గచ్చిబౌలి డివిజన్‌లోని గుల్‌మోహర్ కాలనీలోని జీహెచ్‌ఎంసీ పార్కు. ప్రస్తుత ఉరుకులు, పరుగుల జీవితంలో పార్కులో కాసేపు సేద తీరాలనుకునే వారు ఈ పార్కుకు వస్తున్నారు. జీహెచ్‌ఎంసీ, కాలనీ వెల్ఫేర్ అసోసియేషన్ పార్కు అభివృద్ధికి చర్యలు తీసుకుంటుండడంతో ఆకర్షణీయంగా మారింది.

- గుల్‌మొహర్ కాలనీలో 3.75 ఎకరాల స్థలాన్ని పార్కుకు కేటాయించారు.
- 3 ఎకరాలను పార్కుగా అభివృద్ధి చేయగా మిగిలిన ప్రాంతంలో రాళ్ళు, పొదలు ఉండగా సహజత్వం కోసం వాటిని అలాగే ఉంచేశారు.
- వాకింగ్ ట్రాక్ తప్ప మిగతా అంతా గ్రీనరీయే ఈ పార్కు ప్రత్యేకత.
- పార్కులో వాకర్స్ కోసం 800 మీటర్ల ప్రత్యేక వాకింగ్ ట్రాక్‌ను ఏర్పాటు చేశారు.
- పచ్చని చెట్లు, రకరకాల పూలమొక్కలు కనువిందు చేస్తున్నాయి.
- పావురాలు, బాతులు, పక్షుల శబ్దాలు పల్లెటూరి వాతావరణాన్ని గుర్తు చేస్తున్నాయి.



బాతులు, ఇతర పక్షులు

పుంగనూరు ఆవుల పెంపకం



పుంగనూరు ఆవులు

- గుల్‌మొహర్‌పార్కు కాలనీ పార్కులో పుంగనూరు ఆవులు ప్రత్యేక ఆకర్షణగా మారాయి.
- సుమారు మూడు ఫీట్ల ఎత్తుతో ఆకట్టుకునేలా ఈ ఆవులు ఉంటున్నాయి
- మూడు ఈ ప్రత్యేకమైన ఆవులను ఏపీలోని రాజమండ్రి సమీపం నుంచి తీసుకొచ్చి వాటిని ఈ పార్కులో ఉంచి వాటిని పెంచుతున్నారు.
- ఆ ఆవులు, వాటికి పుట్టే చిన్న ఆవులకు మార్కెట్‌లో చాలా ధరలున్నట్లుగా అందరూ పేర్కొంటుండ డంతో వీటికి ప్రాధాన్యత సంతరించుకుంది.
- ఈ పార్కులో గడపడమేకాకుండా ఈ ఆవులను చూసేందుకు కూడా అందరూ ఆసక్తి కనబరిచే మారాయి.

ఇతర వేడుకలకు ఫొటోషూట్లు

- నేడు ఇళ్లలో జరిగే ప్రతి శుభ కార్యానికి ప్రీ ఫంక్షన్ ఫొటోషూట్లను చేస్తున్నారు. ఈ నేపథ్యంలో పుట్టినరోజు, పెళ్ళి వేడుక, ఇతరత్రా వేడుకలకు ముందుగా ఈ పార్కులో ఫొటో షూట్లు చేసుకుంటున్నారని స్థానికులు తెలిపారు.



పార్కులో బర్త్‌డే ప్రీ షూట్



గుల్‌మొహర్ పార్కు



వాకింగ్ ట్రాక్

5వ రోజు.. 7 నామినేషన్లు

- బీఆర్‌ఎస్ అభ్యర్థి గాంధీ నామినేషన్
- స్వతంత్ర అభ్యర్థిగా శ్యామలాదేవి నామినేషన్
- 18కి చేరిన నామినేషన్ల సంఖ్య



ఆర్‌ఓ బి.శ్రీనివాస్ రెడ్డికి నామినేషన్ పత్రాలను అందజేస్తున్న బీఆర్‌ఎస్ అభ్యర్థి గాంధీ



నామినేషన్ పత్రాలను అందజేస్తున్న స్వతంత్ర అభ్యర్థి ఆరెకపూడి శ్యామలాదేవి

గచ్చిబౌలి: శేరిలింగంపల్లి నియోజకవర్గంలో ఐదో రోజు ఏడు నామినేషన్లు దాఖలయ్యాయి. దీంతో మొత్తం నామినేషన్ల సంఖ్య 18కి చేరింది. బుధవారం బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ నాలుగు సెట్ల నామినేషన్ పత్రాలు ఆర్‌ఓ బి.శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. గాంధీ సతీమణి శ్యామలాదేవి స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ దాఖలు చేశారు. మరో ఐదుగురు స్వతంత్ర అభ్యర్థులు బీర శ్రీనివాస్‌రావు, మేకల వెంకటసుబ్బమ్మ, జ్ఞానరాజు మారుముల్ల, పర్నంది రాములు, జనపల దుర్గాప్రసాద్‌లు నామినేషన్ పత్రాలను ఆర్‌ఓ శ్రీనివాస్‌రెడ్డికి అందజేశారు. ఐదో రోజు ఏడుగురు నామినేషన్లు దాఖలు చేశారని, నామినేషన్ల సంఖ్య 18కి చేరిందని ఆర్‌ఓ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు.

పటాన్‌చెరులో..

పటాన్‌చెరు టౌన్: పటాన్‌చెరు నియోజకవర్గంలో బుధవారం రెండు నామినేషన్‌లు దాఖలయ్యాయి. ఎంసీపీఐ నుండి మియాపూర్‌కు చెందిన దానయ్య నామినేషన్ దాఖలు చేశారు. అలాగే పట్టణంలోని గౌతమ్‌నగర్ చెందిన గణపురం వేణుగోపాల్ స్వతంత్ర అభ్యర్థిగా నామినేషన్ పత్రాలను ఎన్నికల రిటర్నింగ్ అధికారి దేవుజకు అందజేశారు.

అభివృద్ధే నన్ను గెలిపిస్తుంది



నామినేషన్ వేయడానికి ర్యాలీగా వెళుతున్న గాంధీ

గచ్చిబౌలి: బీఆర్‌ఎస్ అభ్యర్థి, సిట్టింగ్ ఎమ్మెల్యే ఆరెకపూడి గాంధీ నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం శేరిలింగంపల్లి రిటర్నింగ్ ఆఫీసర్ బి.శ్రీనివాస్ రెడ్డికి నామినేషన్ పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా ఆరెకపూడి గాంధీ మీడియాతో మాట్లాడుతూ ప్రజలకు అభివృద్ధి, సంక్షేమం అందించిన ఘనత బీఆర్‌ఎస్ పార్టీకి దక్కుతుందన్నారు. పేదింటి మహిళలకు సిలిండర్, మూడువేల పెన్షన్, రూ.15 లక్షల ఆరోగ్య బీమా అందిస్తామని తెలిపారు. తొమ్మిదిన్నర సంవత్సరాల అభివృద్ధికి ప్రజలు అడుగడుగున నీరాజనం పలికారని పేర్కొన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ రాష్ట్రంలో హ్యాట్రిక్ విజయం సాధిస్తుందన్నారు.

ర్యాలీగా వెళ్లి..

కూకట్‌పల్లిలోని వివేకానందనగర్ కాలనీలో ఆరెకపూడి గాంధీ నివాసం నుంచి ఉదయం 7 గంటలకు బైక్‌లు, కార్లతో ర్యాలీగా బయలుదేరారు. వివేకానందనగర్‌లోని రామాలయం, హైదర్‌నగర్‌లోని విజయదుర్గ మైసమ్మ ఆలయంలో పూజలు చేశారు. అనంతరం గంగారంలోని అభయాంజనేయ స్వామికి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం చందానగర్‌లోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాల వేసి అక్కడి నుంచి లింగంపల్లి వరకు ర్యాలీగా వెళ్లారు. తారానగర్‌లోని తుల్జాభవానీ మాత దేవాలయంలో ప్రత్యేక పూజలు చేశారు. ఉదయం 11 గంటలకు శేరిలింగంపల్లి రిటర్నింగ్ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. ర్యాలీలో ఎంపీ రంజిత్ రెడ్డి, కార్పొరేటర్లు హమీద్‌పటేల్, రాగం నాగేందర్ యాదవ్, దొడ్ల వెంకటేష్ గౌడ్, జూపల్లి సత్యనారాయణ, నార్నే శ్రీనివాస్‌రావు, రోజాదేవి, మంజుల రఘునాథ్‌రెడ్డి, సింధు ఆదర్శ్‌రెడ్డి తదితరులు ఉన్నారు.

భారీ గజమాల..

శేరిలింగంపల్లి బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆరికెపూడి గాంధీకి పార్టీ శ్రేణులు అడుగడుగునా ఘన స్వాగతం పలికారు.గుల్‌మొహర్‌పార్కు కాలనీ చౌరస్తాలో క్రేన్ సాయంతో భారీ గజమాల వేసి నినాదాలు చేశారు. ఆ ప్రాంతాన్ని గులాబీమయం చేశారు.

తరలిన ఆల్విన్ కాలనీ నాయకులు

ఆల్విన్‌కాలనీ: శేరిలింగంపల్లి నియోజకవర్గ బీఆర్‌యస్ ఎమ్మెల్యే అభ్యర్థి ఆరెకపూడి గాంధీ బుధవారం నామినేషన్ దాఖలు చేశారు. ఆల్విన్ కాలనీ డివిజన్ కార్పొరేటర్ దొడ్ల వెంకటేష్‌గౌడ్ ఆధ్వర్యంలో భారీ సంఖ్యలో పార్టీ నాయకులు, కార్యకర్తలు, మహిళా నాయకురాళ్లతో కలిసి భారీ ర్యాలీగా తరలి వెళ్లారు.

'మనూ'లో వర్క్‌షాప్

రాయదుర్గం: గచ్చిబౌలిలోని హెచ్‌కే షేర్వానీ సెంటర్ ఫర్ డెక్కన్ స్టడీస్, సొసైటీ ఫర్ ఇండియన్ ఓషన్ స్టడీస్ (ఎస్‌ఐఓఎస్) న్యూఢిల్లీ సహకారంతో 'ది డెక్కన్: మారిటైమ్ ఔట్‌లుక్ అండ్ అపర్చునిటీస్' అనే అంశంపై మనూలో ఒక రోజు సమావేశాన్ని బుధవారం నిర్వహించారు. ఈ సమావేశంలో రక్షణ వ్యూహం, వాణిజ్య మార్గాలు, కమ్యూనికేషన్లు, షిపింగ్, షిప్పింగ్ సాంకేతికత, సముద్ర కనెక్షన్‌లు, భారతదేశంలోని ఓడరేవులు, షిప్పింగ్, షిప్ బిల్డింగ్ యొక్క ప్రస్తుత స్థితి వంటి అనేక అంశాలు చర్చకు వచ్చాయి. సమావేశంలో ఎస్‌ఐఓఎస్ చైర్మన్ రాయబారి సుధీర్ దేవరే, అడ్మిరల్ అరుణ్ ప్రకాశ్, ఉస్మానియా యూనివర్సిటీ మాజీ డైరెక్టర్ ప్రొఫెసర్ పివిరావ ప్రసంగించారు.

ఆస్తులు రూ.44 కోట్లు.. అప్పులు రూ.96 లక్షలు

అఫిడవిట్‌లో ప్రకటించిన బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ

సాక్షి, సిటీబ్యూరో: శేరిలింగంపల్లి అసెంబ్లీ నియోజకవర్గం బీఆర్‌ఎస్ అభ్యర్థి ఆరెకపూడి గాంధీ ఆస్తులు రూ.44,79,93,000 కాగా అప్పులు రూ.96, 34,167గా ఉన్నాయి. నామినేషన్‌తో పాటు దాఖలు చేసిన అఫిడవిట్‌లో ఆయన ఈ వివరాలను వెల్లడించారు. వీటికి అదనంగా గాంధీ భార్య శ్యామలదేవికి రూ.31,65,38,000 ఆస్తులు ఉండగా అప్పులు రూ.86,34,167 ఉన్నాయి. 2014లో మాదాపూర్ ఠాణా పరిధిలో అనుమతి లేకుండా ర్యాలీ నిర్వహించిన ఆరోపణలతో గాంధీపై ఓ కేసు నమోదైంది. గత ఎన్నికల (2018) అఫిడవిట్‌లో ఈ విషయాన్ని ఆయన స్పష్టం చేశారు. ఈ కేసు పరిష్కారం కావడంతో ప్రస్తుతం గాం. దీకి ఎలాంటి నేర చరిత్ర లేదు.

ఆస్తులు, అప్పులు ఇలా...

గాంధీ	శ్యామలాదేవి	
చేతిలో నగదు	రూ.1,89,900	రూ.1,55,800
బ్యాంక్ బ్యాలెన్స్ (డిపాజిట్లు, ఎఫ్‌డీలతో కలిపి)	రూ.52,03,902	రూ.9,86,184
షేర్ల, బాండ్ల విలువ	రూ.35,000	రూ.29,000
వాహనం	ఫార్చ్యునర్	లేదు
బంగారం	50 గ్రాములు	1200 గ్రాములు
వెండి	లేదు	10 కేజీలు
పెట్టుబడులు	రూ.2,34,26,845	రూ.3,62,91,191
వ్యవసాయ భూములు	21.85 ఎకరాలు	18.34 ఎకరాలు
వ్యవసాయేతర	16620.3 చ.అ.	15551.91 చ.అ.
కమర్షియల్ బిల్డింగ్స్	40,154 చ.అ	36,644 చ.అ.
మొత్తం ఆస్తులు	రూ.44,79,93,000	రూ.32,65,38,000
అప్పులు	రూ.96,34,167	రూ.86,34,167

- బ్యాంక్ బ్యాలెన్స్‌లు ఎన్నికల ఖర్చు కోసం తెరిచిన ఖాతాల్లో ఉన్న రూ.40 లక్షలతో కలిపి.

హెచ్‌సీయూ- ముంబాయి టీమ్ లీజ్ ఎడ్‌టెక్ ఒప్పందం

రాయదుర్గం: వృత్తిపరమైన డిప్లొమో కోర్సులను అందించడానికి హైదరాబాద్ సెంట్రల్ యూనివర్సిటీ- ముంబైలోని టీమ్ లీజ్ ఎడ్‌టెక్ లిమిటెడ్‌తో ఒప్పందం కుదుర్చుకుంది. గచ్చిబౌలిలోని హెచ్‌సీయూ ప్రాంగణంలో రెండు సంస్థల ప్రతినిధులు ఒప్పందంపై బుధవారం సంతకాలు చేశారు. హెచ్‌సీయూ రిజిస్ట్రార్ డాక్టర్ దేవేష్‌నిగమ్, టీమ్ లీజ్ తరపున ఆ సంస్థ బిజినెస్ రీజినల్ హెడ్ రోహిత్‌డోగ్రా సంతకాలు చేశారు. హెచ్‌సీయూ వైస్‌చాన్సలర్ ప్రొఫెసర్ బీజే రావు, ప్రొఫెసర్ ఎస్‌ఎల్ సబత్ సమక్షంలో ఈ ఒప్పందం జరిగింది. రెండు సంస్థలు కలిసి సీడీబీఎల్ ద్వారా ఆన్‌లైన్‌లో పలు కోర్సులను అందించేందుకు అంగీకరించారు. ముఖ్యంగా డిప్లొమో ఇన్ ఎనర్జీ మేనేజ్‌మెంట్ (డీఈఎస్‌ఎం), డిప్లొమో ఇన్ కమ్యూనికేషన్ సి ఇంగ్లీష్ (డీసీఈ), డిప్లొమో ఇన్ గవర్నెన్స్ (డీజీ), డిప్లొమో ఇన్ ఏఐ అండ్ ఎంఎల్ (డీఏఐ అండ్ ఎంఎల్), జావా ఎఫ్‌ఎస్‌డీలో డిప్లొమో వంటి కోర్సులను అందించాలని ఒప్పందంలో నిర్ణయించారు. ఈ ఒప్పందం మూడేళ్ల కాలపరిమితితో అమలులో ఉంటుంది. కార్యక్రమంలో హెచ్‌సీయూ ఆర్ అండ్ డీ డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్‌ఎల్ సబత్, సీడీవీఎల డైరెక్టర్ ప్రొఫెసర్ ఎస్ జిలాని, ప్రొఫెసర్ ఈ వెంకటేష్, టీమ్ లీజ్ యూనివర్సిటీ బిజినెస్ డెవలప్‌మెంట్ సీనియర్ మేనేజర్ నాగరాజు నాయుడు పాల్గొన్నారు.

ముగిసిన 'పునర్కృతి, నారీ శక్తి'

హఫీజ్‌పేట్ : చందానగర్‌లోని మహిళా దక్షత సమతి విద్యా సంస్థలు, సుమన్ బాలికల జూనియర్ కళాశాల, వీడీ బజాజ్ మహిళా డిగ్రీ కళాశాలలో పునర్కృతి, నారీశక్తి కార్యక్రమాలు బుధవారం విజయవంతంగా ముగిశాయి. ముఖ్యఅతిథులుగా రిటైర్డ్ ఐఏఎస్ వినోద్ అగర్వాల్, అభిలాష్, అసోసియేట్ ప్రొఫెసర్ సుష్మాదేవి, మహిళా దక్షత సమితి అధ్యక్షురాలు సరోజ బజాజ్‌లు హాజరయ్యారు. చదువుతోనే అభివృద్ధి అని వివరించారు.

వాహనాల రాకపోకలు బంద్



లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా వరద నీరు

శేరిలింగంపల్లి: లింగంపల్లి రైల్వే అండర్ బ్రిడ్జి కింద భారీగా వరదనీరు చేరడంతో వాహనాల రాకపోకలు నిలిచిపోయాయి. మంగళవారం రాత్రి కురిసిన వర్షానికి వరద చేరడంతో రాత్రి 8 గంటల నుంచి వాహనాల రాకపోకలు పూర్తిగా నిలిచిపోయాయి. మసీద్‌బండ మీదుగా వచ్చే వరద గోపీచెరువు, చాకలి చెరువు మీదుగా రైల్వే అండర్ బ్రిడ్జి కిందికి చేరింది. దీంతో భెల్ చౌరస్తా నుంచి తారానగర్ మీదుగా వచ్చే వాహనాలను నల్లగండ్ల రైల్ ఓవర్ బ్రిడ్జి మీదుగా మళ్ళించడంతో ట్రాఫిక్ స్తంభించిపోయింది. వాహనదారులు ఇబ్బందుల పాలయ్యారు. జీహెచ్‌ఎంసీ సిబ్బంది వరద నీటిని మళ్ళించారు.

బీజేపీ విజయానికి కృషి చేయాలి



శేరిలింగంపల్లి: తెలంగాణ అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని పార్టీ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు ఎం.రవికుమార్ యాదవ్ తెలిపారు. బుధవారం శేరిలింగంపల్లి భెల్ ఎంఐజీ కాలనీలో బీజేపీ నాయకులు గోదావరి అంజిరెడ్డి, మహిపాల్‌రెడ్డిల ఆధ్వర్యంలో బీజేపీ మహిళా మోర్చా నాయకులతో సమావేశమయ్యారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఎం.రవికుమార్‌యాదవ్ మాట్లాడుతూ శేరిలింగంపల్లిలో బీజేపీ విజయానికి కృషి చేయాలని కోరారు. ప్రతి ఓటరును కలిసి మోడీ ప్రభుత్వం చేస్తున్న అభివృద్ధి, సంక్షేమ పథకాలను వివరించాలన్నారు.

కాంగ్రెస్ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్‌కు నాయి బ్రాహ్మణ సంఘం మద్దతు



శేరిలింగంపల్లి: శేరిలింగంపల్లి నాయి బ్రహ్మణ సంఘం అధ్యక్షులు రవి కుమార్ నాయి ఆధ్వర్యంలో కాంగ్రెస్ అభ్యర్థి వి.జగదీశ్వర్‌గౌడ్‌ను కలిసి మద్దతు తెలిపారు. సంఘం ప్రతినిధులకు పార్టీ కండువాలు కప్పి జగదీశ్వర్ గౌడ్ ఆహ్వానించారు. ఈ సందర్భంగా జగదీశ్వర్‌గౌడ్ మాట్లాడుతూ కాంగ్రెస్ పార్టీ ఆరు గ్యారంటీలకు అన్ని వర్గాలనుంచి స్పందన బాగుందన్నారు. రాష్ట్రంలో వచ్చేది కాంగ్రెస్ ప్రభుత్వమేనన్నారు. సంఘం అధ్యక్షులు రవి కుమార్ నాయి మాట్లాడుతూ శేరిలింగంపల్లి ఎమ్మెల్యేగా జగదీశ్వర్‌గౌడ్ గెలిపించుకుంటామన్నారు. కార్యక్రమంలో సంఘం నాయకులు సాయన్న, ముత్యాలు, రవీందర్, భాస్కర్, జనార్దన్, బాలరాజ్, భిక్షపతి, వెంటేష్, సాయిబాబ, మహేందర్, జగదీష్, సురేష్ తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నాయకుల ప్రచారం



ఆల్విన్‌కాలనీ: వివేకానందనగర్ డివిజన్ వెంకటేశ్వరనగర్‌లో కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి జగదీశ్వర్‌గౌడ్‌కు మద్దతుగా నాయకులు ఎన్నికల ప్రచారం చేశారు. హస్తం గుర్తుకు ఓటు వేసి గెలిపించాలని ప్రజలను కోరారు. కార్యక్రమంలో కాంగ్రెస్ పార్టీ డివిజన్ నాయకురాలు విద్యాకల్పన ఏకాంత్ గౌడ , యాదగిరి, మూకయ్య ,కార్యకర్తలు పాల్గొన్నారు.

రేపు భవిష్యనిధి అదాలత్

మూసాపేట: కూకట్‌పల్లిలోని ప్రావిడెంట్ ఫండ్ కార్యాలయంలో భవిష్యనిధి అదాలత్ నిర్వహించనున్నట్లు పిఎఫ్ కమిషనర్ డా.హేమంత్ తెలిపారు. ఈ నెల 19న ఉదయం 10 గంటలకు కూకట్‌పల్లి ప్రశాంత్‌నగర్‌లోని ఆర్‌టిసి బస్ టెర్మినల్‌లోని రెండవ అంతస్తులో గల పీఎఫ్ కార్యాలయంలో ఉంటుందని, కూకట్‌పల్లి, మియాపూర్, లింగంపల్లి, బీహెచ్ఇఎల్, జీడిమెట్ల, సనత్‌నగర్ ఖాతాదారులు పాల్గొనవచ్చని తెలిపారు.

పదేళ్లలో వందేళ్ల ప్రగతి

- మేనిఫెస్టోలను అమలు చేయని చరిత్ర కాంగ్రెస్ పార్టీది : ఎమ్మెల్యే గూడెం
- ప్రజల మనిషి మహిపాల్ రెడ్డి: కాసాని

పటాన్‌చెరు: సీఎం కేసీఆర్ నాయకత్వంలో పటాన్‌చెరు నియోజకవర్గంలో పదేళ్ల కాలంలో వందేళ్ల ప్రగతిని సాధించామని ఎమ్మెల్యే, బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. ప్రతీ కార్యకర్త గడపగడపకు వెళ్లి పదేళ్ల ప్రగతిని వివరించి 'కారు' గుర్తుపై ఓటు వేయాలని ప్రజలకు విజ్ఞప్తి చేయాలని కోరారు. గురువారం ఉదయం 11 గంటలకు రుద్రారం గణేష్ గడ్డ దేవాలయంలో పూజలు నిర్వహించి నామినేషన్ వేయబోతున్నట్లు తెలిపారు. మతం పేరుతో రాజకీయాలు చేసే బీజేపీ నాయకులు వాళ్ళ రాజకీయ జీవితంలో ఏనాడైనా ఒక గుడికి సున్నం వేశారా? అని ప్రశ్నించారు. రంగు రంగుల కరపత్రాలతో, మోసపూరిత హామీలతో మేనిఫెస్టోను ప్రకటించిన కాంగ్రెస్ పార్టీ ఏనాడైనా మేనిఫెస్టోలోని హామీలను అమలు చేసిందా అని నిలదీశారు. పటాన్‌చెరులో ఏర్పాటు చేసిన బీఆర్‌ఎస్ పార్టీ నియోజకవర్గ స్థాయి ఆత్మీయ సమ్మేళనానికి ఎమ్మెల్యే జీఎంఆర్, శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి, మాజీ ఎమ్మెల్సీ కాసాని జ్ఞానేశ్వర్, మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ఓటు అడిగే నైతిక హక్కు కేవలం బీఆర్‌ఎస్ పార్టీకే ఉందన్నారు. కేసీఆర్ నాయకత్వంలో పదేళ్లలో రూ.9 వేల కోట్లతో పటాన్‌చెరును అభివృద్ధికి నిదర్శనంగా నిలిపామన్నారు. ప్రతీ గ్రామానికి ప్రణాళికాబద్ధంగా నిధులు కేటాయించి ప్రజల అవసరాలు, ఆకాంక్షల అనుగుణంగా అభివృద్ధి పనులు చేయడంతో పాటు ప్రతీ ఇంటికి సంక్షేమ పథకాలు అందించామన్నారు. అన్ని వర్గాల ప్రజలు ఏకగ్రీవ మద్దతు అందిస్తూ బీఆర్‌ఎస్ పార్టీని నిండు మనసుతో ఆశీర్వదిస్తున్నారని చెప్పారు. లక్ష మెజారిటీ లక్ష్యంగా పనిచేయాలని కోరారు. అనంతరం శాసనమండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి మాట్లాడుతూ సీఎం కేసీఆర్ నాయకత్వంలో అటు రాష్ట్రంలో, ఇటు పటాన్‌చెరు నియోజకవర్గంలో అభివృద్ధి, సంక్షేమం జోడెద్దుల మాదిరిగా పరుగెడుతున్నాయన్నారు. ప్రతీ గడపకు పార్టీ హామీలను వివరించాలని సూచించారు. కాసాని జ్ఞానేశ్వర్ మాట్లాడుతూ ఎమ్మెల్యే మహిపాల్‌రెడ్డిని 40 ఏళ్లుగా చూస్తున్నానని, ఆయనది ప్రజల కోసం కష్టించే మనస్తత్వమన్నారు. మహిపాల్‌రెడ్డి విజయం ఎప్పుడో ఖరారైందని, మెజార్టీయే మిగిలిందన్నారు. మాజీ ఎమ్మెల్యే సత్యనారాయణ మాట్లాడుతూ పటాన్‌చెరు నియోజకవర్గం మొత్తం బీఆర్‌ఎస్ పార్టీ వెన్నంటే ఉందన్నారు. ఈ 20 రోజులు ప్రతీ కార్యకర్తకు అత్యంత కీలకమని, ప్రతీ ఓటరును వ్యక్తిగతంగా కలిసి కారు గుర్తుకు ఓటు వేయాల్సిన ఆవశ్యకతను వివరించాలని కోరారు. అనంతరం బొల్లారం, పటాన్‌చెరు డివిజన్‌కు సంబంధించిన పలు పార్టీల నాయకులు బీఆర్‌ఎస్‌లో చేరారు.

బీఆర్‌ఎస్ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరు

పటాన్‌చెరు: బీఆర్‌ఎస్ పార్టీ విజయాన్ని ఎవరూ అడ్డుకోలేరని, మూడోసారి కూడా పటాన్‌చెరు ఎమ్మెల్యేగా మహిపాల్‌రెడ్డి విజయం సాధిస్తారని, పటాన్‌చెరులో బీఆర్ఎస్ జెండా ఎగరవేయడం ఖాయమని అమీన్‌పూర్ మున్సిపల్ కౌన్సిలర్ నవనీత అన్నారు. బుధవారం అమీన్‌పూర్ పరిధిలోని బీరంగూడ ఎస్ఎస్‌ఎల్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహించి, బీఆర్‌ఎస్ పార్టీ మేనిఫెస్టోను ప్రజలకు వివరించారు.

రాజకీయాల్లో యువత కీలకపాత్ర పోషించాలి

పటాన్‌చెరు: నాడు తెలంగాణ ఉద్యమంలో, నేడు బంగారు తెలంగాణ నిర్మాణంలో యువత పాత్ర అత్యంత కీలకమని బీఆర్‌ఎస్ పార్టీ అభ్యర్థి, పటాన్‌చెరు ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి అన్నారు. బుధవారం పటాన్‌చెరు డివిజన్ పరిధిలోని శాంతినగర్ కాలనీలో ఏర్పాటు చేసిన సమావేశంలో కాలనీకి చెందిన యువకులు భారీ సంఖ్యలో బీఆర్‌ఎస్ పార్టీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రస్తుత రాజకీయాల్లో యువత భాగస్వామ్యం పెరగాల్సిన అవసరం ఉందన్నారు. బీఆర్‌ఎస్ పార్టీ ప్రతీ విజయంలో యువత భాగస్వామ్యం కీలకమన్నారు. రాబోయే అసెంబ్లీ ఎన్నికల్లో పార్టీ విజయానికి సైనికుల్లా కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో కార్పొరేటర్ మెట్టు కుమార్ యాదవ్, వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ విజయ్‌కుమార్, మాజీ కార్పొరేటర్ శంకర్ యాదవ్, పార్టీ పట్టణ అధ్యక్షులు అఫ్జల్, గూడెం సంతోష్ రెడ్డి, నాయకులు పాల్గొన్నారు.

జోరుగా బీఆర్‌ఎస్ ప్రచారం

జిన్నారం(పటాన్‌చెరు): అసెంబ్లీ ఎన్నికల ప్రచారంలో భాగంగా పటాన్‌చెరు ఎమ్మెల్యే అభ్యర్థి గూడెం మహిపాల్ రెడ్డికి మద్దతుగా బొల్లారం మున్సిపాలిటీలో బీఆర్‌ఎస్ శ్రేణులు జోరుగా ప్రచారం నిర్వహించారు. బుధవారం మున్సిపాలిటీలోని గాంధీనగర్, బీరప్ప బస్తీ, శ్రీరామ్‌నగర్‌లలో పార్టీ రాష్ట్ర సీనియర్ నాయకుడు, మున్సిపల్ కౌన్సిలర్ చంద్రారెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన గడపగడపకూ ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి గూడెం యాదమ్మ పాల్గొన్నారు. ప్రభుత్వ సంక్షేమ పథకాలను ఓటర్లకు వివరించాలన్నారు. గూడెం మహిపాల్ రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలన్నారు. కార్యక్రమంలో బీఆర్‌ఎస్ మున్సిపల్ అధ్యక్షుడు హనుమంత్ రెడ్డి, కౌన్సిలర్లు నిహారిక, గోపాలమ్మ, చంద్రయ్య, స్థానిక నాయకులు, మా అంబి మహిళా సేవా సమితి మహిళలు, ఆటో యూనియన్ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



నియోజకవర్గస్థాయి ఆత్మీయ సమ్మేళనంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే మహిపాల్ రెడ్డి



బీరంగూడ ఎస్ఎస్‌ఎల్ కాలనీలో ఇంటింటి ప్రచారం నిర్వహిస్తున్న కౌన్సిలర్ నవనీత



ఇంటింటి ప్రచారంలో ఎమ్మెల్యే సతీమణి యాదమ్మ, కౌన్సిలర్ చంద్రారెడ్డి

కేసీఆర్ నాయకత్వంలో వడ్డెరల అభివృద్ధి

రామచంద్రాపురం(పటాన్‌చెరు): సీఎం కేసీఆర్ నాయకత్వంలో వడ్డెరల అభివృద్ధి సాధ్యమైందని ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి, శాసన మండలి మాజీ చైర్మన్ భూపాల్ రెడ్డి అన్నారు. రామచంద్రాపురం డివిజన్ పరిధిలోని వడ్డెరల ఆత్మీయ సమ్మేళనానికి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడుతూ తెలంగాణ ఏర్పడిన అనంతరం అన్ని వర్గాల అభివృద్ధికి సీఎం కేసీఆర్ వేల కోట్లు కేటాయిస్తున్నారన్నారు. కొనసాగుతున్న అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలు కొనసాగాలంటే అసెంబ్లీ ఎన్నికల్లో బీఆర్‌ఎస్ విజయానికి సహకారం అందించాలని కోరారు. అనంతరం అశోక్‌నగర్‌లో ఆక్సిలరీ కార్మికుల సమావేశానికి హాజరయ్యారు. కార్యక్రమంలో కార్పొరేటర్లు పుష్ప నగేష్, సింధు ఆదర్శ్ రెడ్డి, మాజీ కార్పొరేటర్లు అంజయ్య, శంకర్ యాదవ్, పార్టీ సర్కిల్ అధ్యక్షుడు పరమేష్, నాయకులు పాల్గొన్నారు.



ఆత్మీయ సమ్మేళనంలో మహిపాల్ రెడ్డి, భూపాల్ రెడ్డిని సన్మానిస్తున్న దృశ్యం